సాక్షి
మహబూబాబాద్
ఆదివారం । 23 । మార్చి । 2025



అరచేతిలో విద్యుత్‌సేవలు
టీజీ ఎన్పీడీసీఎల్ రూపొందించిన యాప్‌తో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించనున్నారు.
- 8లో▸



సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన
సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
38° /22°

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. పలు చోట్ల ఉరుములు, మెరుగులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

ఇఫ్తార్	సహర్
ఆది 6:34	సోమ 4:55

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నీటిని పొదుపుగా వాడుకోవాలి



కురవి: ప్రతిఒక్కరు నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా భూగర్భ జల శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేముల సురేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటి సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వృథాను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నరసింహస్వామి, తహసీల్దార్ సునీల్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.

పుష్‌పుల్ రాకపోకలు షురూ

మహబూబాబాద్ రూరల్: కాజీపేట, విజయవాడ మధ్య నడిచే పుష్‌పుల్ రైలు రాకపోకలు శనివారం ప్రారంభమయ్యాయి. వివిధ కారణాలతో జనవరి 25 నుంచి పుష్‌పుల్ రైలు రాకపోకలను దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిలిపేశారు. సుమారు రెండు నెలల అనంతరం మళ్లీ రైలు రాకపోకలు ప్రారంభిస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు పేదలు, చిరువ్యాపారులు, అప్ అండ్ డౌన్ చేసే ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీకి కొత్త బస్సులు



నెల్లికుదురు: మహబూబాబాద్ ఆర్టీసీ డిపోకు 11 కొత్త బస్సులు వచ్చాయి. ఇదివరకే డిపోలో ఉన్న బస్సుల్లో కొన్ని మరమ్మతుకు గురికాగా వాటి స్థానంలో కొత్తగా వచ్చిన బస్సులను నడిపించనున్నారు. కొత్త బస్సులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సులను ప్రారంభించి మెరుగైన రవాణా సౌకర్యాన్ని కల్పించనున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

పెద్దవంగర: హైదరాబాద్‌లో నేడు జరుగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెద్దవంగర మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ నెల 19న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సాధ్విక, నందిని, అంజలి ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంఈఓ బురారపు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు కంచెర్ల ప్రభాకర్ శనివారం విద్యార్థులను అభినందించి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనబర్చాలని కోరారు.

అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి



మహబూబాబాద్/నెల్లికుదురు: మహిళలకు, గర్భిణులకు, బాలింతలకు హెచ్ఐవీ, ఎయిడ్స్, తదితర వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, బాల రక్ష భవన్ సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సిబ్బందికి అడ్వకేసీ కమిటీ సమావేశం, సెన్సిటైజేషన్ వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రవణ్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి, సీడబ్ల్యూసీ మెంబర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది విద్యార్థుల గైర్హాజరు

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు రెండో రోజు హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి శనివారం తెలిపారు. జిల్లాలో 46 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 8,158 మందికిగాను 8,177 మంది విద్యార్థులు హాజరుకాగా 8 మంది గైర్హాజరయ్యారన్నారు. జిల్లాలోని పలు పరీక్ష సెంటర్లలో తనిఖీ బృందాలు తనిఖీ చేశారన్నారు.

ముహూర్తం ఖరారు

ఏప్రిల్ నుంచి సన్నబియ్యం పంపిణీకి సిద్ధం

- బఫర్ గోదాముల్లో మెండుగా నిల్వలు
- ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలింపు
- నెలాఖరులోపు డీలర్ పాయింట్‌కు..
- డీలర్లతో సమావేశం నిర్వహించిన అధికారులు
- జిల్లాలో 2,41,012 లక్షల కార్డులు



సాక్షి, మహబూబాబాద్: దేశంలో ఏ ఒక్కరు కూడా ఆకలితో చనిపోవద్దని చేసిన ఆహార భద్రతా చట్టంలో భాగంగా నిరుపేదలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం ఇంతకాలం దొడ్డు బియ్యానికే పరిమితమైంది. ముద్ద అన్నం, దొడ్డుగా ఉండటం, ముక్కిపోయిన బియ్యం రావడంతో రేషన్ బియ్యం తీసుకుంటున్న సగం మంది పేదలు ఈ అన్నం తినడం లేదు. దీనిని గమనించిన ప్రభుత్వం ఉగాది నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేసేందుకు ముహూర్తం ఖరారు చేసింది. ఇప్పటికే రేషన్ డీలర్లతో సమీక్షలు నిర్వహించి పంపిణీపై చర్చించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెలకు 4వేల మెట్రిక్ టన్నులు..

జిల్లాలోని 556 రేషన్ షాపుల ద్వారా ఆహార భద్రతాకార్డులు, అంత్యోదయ, అన్నపూర్ణ మొత్తం 2,41,012 కార్డుల్లోని 7,03,550 మందికి నెలకు 4,511 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీటితోపాటు 96 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 51,007 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం 1,511 క్వింటాళ్లు, 113 కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, బీసీ, ట్రైబల్, ఎస్సీ, మైనార్టీ, జ్యోతిరావుపూలే, ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్, డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో చదివే 21,923 మంది విద్యార్థులకు 3,320 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేస్తున్నారు. గతంలో 3 వేల మెట్రిక్ టన్నుల మేరకు దొడ్డు బియ్యం కోసం ఆర్వోలు తీసేవారు. ఇందులో కూడా కొందరు లబ్ధిదారులు బియ్యం తీసుకోకుండా ఉండేవారు. కానీ ఇప్పుడు సన్న బియ్యం ఇస్తారని తెలియడంతో 90శాతానికి పైగా లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకునే అవకాశం ఉంది. నెలకు 4వేల మెట్రిక్ టన్నుల మేరకు సన్న బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది.

రేషన్ డీలర్లతో అధికారుల సమీక్షలు

ఏప్రిల్ మాసం నుంచి సన్న బియ్యం పంపిణీపై జిల్లా ఉన్నతాధికారులు, సివిల్ సప్లయీస్ అధికారులు డీలర్లతో సమీక్షలు నిర్వహించారు. జిల్లాలోని 556 డీలర్ షాపుల నిర్వాహకులతో అధికారులు మాట్లాడారు. ఇప్పటి వరకు రేషన్ షాపుల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం లెక్కలు ఒకటి రెండు రోజుల్లో తేల్చి వాటిని నిల్వ ఉంచాలని సూచించారు. అవసరం మేరకు సన్న బియ్యం ఆర్వోలు తీసుకొని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డీలర్ పాయింట్లకు చేర్చుకోవాలని చెప్పారు. బియ్యం పంపిణీ విషయంలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించినట్లు తెలిసింది.

సంమృద్ధిగా సన్న బియ్యం నిల్వలు..

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం సరఫరా చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందనే పనిలో కలెక్టర్, సివిల్ సప్లయీస్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. క్వింటాకు రూ.500బోనస్ వస్తుందని 90వేల మెట్రిక్ టన్నుల మేరకు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చి అమ్మారు. ఈ ధాన్యం మిల్లింగ్ చేస్తే సుమారుగా 50వేల మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం సీఎంఆర్ రూపంలో బఫర్ గోదాంకు వస్తాయి. ఇప్పటికే 30 వేల మెట్రిక్ టన్నుల మేరకు సీఎంఆర్ పెట్టినట్లు తెలిసింది. ఈ లెక్కన చూస్తే రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇచ్చినా.. మళ్లీ వర్షాకాలం ధాన్యం వచ్చేవరకు బియ్యం సరఫరాలో ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో బియ్యం సరఫరా ఇలా..

కార్డుల రకం	కార్డుల సంఖ్య	యూనిట్లు	సరఫరా చేసే బియ్యం (మెట్రిక్ టన్నుల్లో)
అంత్యోదయ	16,794	49,576	587.79
ఆహార భద్రత	2,24,216	6,53,969	3,923.814
అన్నపూర్ణ	02	05	20 కిలోలు
మొత్తం	2,41,012	7,03,550	4,511.624

సన్న బియ్యం ఇస్తే చాలు..



రేషన్ షాపుల్లో ఇచ్చే దొడ్డు బియ్యం అన్నం ముద్దగా ఉండటం, అరుగక పోవడంతో కిలోకు రూ. 70 చొప్పున సన్న బియ్యం కొని తింటున్నాం. దీంతో చేసిన కష్టంలో సగం డబ్బులు బియ్యానికే ఖర్చు అవుతున్నాయి. ఇప్పుడు రేషన్ బియ్యం సన్నవి ఇస్తే చాలు సంతోషంగా తింటాం.

- సుశీల, గూడూరు

అందరూ తీసుకుంటారు..



ఇప్పుడిచ్చే దొడ్డు బియ్యం అందరు తీసుకోవడం లేదు. కొన్ని చోట్ల డీలర్లు వేలిముద్ర వేసుకొని డబ్బులు ఇస్తున్నారు. మరికొందరు ఇంటికి తెచ్చిన బియ్యం అమ్ముతుండ్రు. సన్నబియ్యం ఇస్తే అందరూ తీసుకుంటారు.. ప్రభుత్వం సన్నబియ్యం ఇవ్వడం మంచి నిర్ణయం

- చిప్పరపల్లి బొందమ్మ, కొత్తూరు(సీ), సీరోలు

సర్వం సిద్ధం చేస్తున్నాం..



నిరుపేదలకు రేషన్ షాపుల నుంచి సన్న బియ్యం సరఫరాకు సర్వం సిద్ధం చేస్తున్నాం. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి డీలర్ పాయింట్‌కు సన్న బియ్యం సరఫరా ఏర్పాట్లు జరుగుతున్నాయి. డీలర్లతో కూడా సమీక్షలు నిర్వహించాం. ఉగాది నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తాం.

- ప్రేమ్ కుమార్, డీఎస్ఓ

బాధితులకు భరోసా కల్పించాలి

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



భరోసా సెంటర్‌ను సందర్శించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: మహిళలు, చిన్నారులు వేధింపుల నుంచి రక్షణ పొందేలా పోలీసులు, భరోసా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ ఎస్పీ శనివారం సందర్శించి భరోసా సేవలను సమీక్షించారు. ఎస్పీ చొరవతో 2022 నుంచి 2024 వరకు భరోసా కేంద్రం ద్వారా 56 మంది బాధితులకు ప్రభుత్వం తరపున రూ.20.75 లక్షలు బాధితుల బ్యాంకు ఖాతాల్లోకి జమచేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాయిదా పడకుండా వెంటనే విడుదల చేయించబడగా బాధితులకు పరిహారం అందేవిధంగా కృషి చేసిన డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సరవయ్యను ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల ఖాతాల్లోకి పరిహారం వేగంగా జమ చేయడానికి భరోసా యంత్రాంగం మరింత సమర్థంగా పని చేయాలని సూచించారు. బాధితులకు ఇచ్చే మానసిక, లీగల్ కౌన్సెలింగ్ మరింత బలోపేతంచేసి, వారికి తగిన సహాయం అందించాలన్నారు. భరోసా కేంద్రం మహిళలు, చిన్నారుల రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన సహాయం పొందేందుకు ప్రజలు దీనిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భరోసా టీం సభ్యులు జ్యోత్స్న, జయశ్రీ, పార్వతి, రేణుక, మౌనిక, ఎస్బీ సీఐ చంద్రమౌళి, రూరల్ సీఐ సర్వయ్య, రూరల్ ఎస్సై దీపిక, షీ టీం ఎస్సై సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్తగా ఒకరోజు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను హైస్కూల్ స్థాయిలో వెలికితీసేందుకు, పరిశోధనలపై ఆసక్తి పెంపొందించేందుకు విద్యార్థులకు శాస్త్రవేత్తగా ఒకరోజు వినూత్న కార్యక్రమానికి ఎన్సీఈఆర్టీ హైదరాబాద్ రీసెర్చ్ సెంటర్ శిక్షణ నిర్వహిస్తుందని డీఈఓ ఏ.రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఏప్రిల్ 5వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి అప్పారావు (9849598281)ను సంప్రదించాలన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఉపాధి పనులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచి వందరోజుల పని దినాలు కల్పించాలన్నారు. మార్చి 31 లోపు ఇంటి పన్ను వంద శాతం వసూళ్లు పూర్తి చేయాలన్నారు. వీసీలో డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు, డీపీఓ హరిప్రసాద్, పీఆర్ ఈఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

నెల్లికుదురు: రైతులు వ్యవసాయానికి అనుకూలంగా లేని వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రైతులకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, పీఎం కుసుమ్‌పై అవగాహన సదస్సును సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. సోలార్ విద్యుత్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ జనగం నరేశ్ మాట్లాడుతూ జిల్లాలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 126 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు 25 సంవత్సరాల పాటు అగ్రిమెంట్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీఈ పెద్ది రాజం, మధుసూదన్, విజయ్, రాజ్యలక్ష్మీ, ప్రశాంత్, లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం ఉండొద్దు

- విద్యుత్ శాఖ సీఈ రాజు చౌహాన్



విద్యుత్ బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న సీఈ రాజు చౌహాన్

మరిపెడ రూరల్: వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించి, నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ సీఈ రాజు చౌహాన్ అన్నారు. శనివారం మరిపెడ మండలం ఎల్లంపేట సబ్ స్టేషన్ పరిధిలోని ఎల్లంపేట, సోమ్లతండా గ్రామాలను వేరు చేస్తూ విద్యుత్ అంతరాయం తగ్గించడంతో భాగంగా రూ.8.79 లక్షలతో మరో బ్రేకర్‌ను ఏర్పాటు చేయగా సీఈ రాజు చౌహాన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.3.26 లక్షలతో పోల్ స్ట్రక్చర్ అనుసంధానం, ఆనెపురం స్టేజీ వద్ద రూ.2.25లక్షలతో కేపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ అంతరాయానికి తొర్రూర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారుల చేస్తున్న కృషిని అభినందించాడు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ జిల్లా అధికారి జి.నరేష్, ఎంఆర్‌టీ సునీతాదేవి, డీఈ మధుసూదన్, ఎల్లంపేట ఏఈ బి.అజయ్, లోక్‌నాథ్‌రెడ్డి, సబ్ ఇంజనీర్ రుబీనా తదితరులు పాల్గొన్నారు.

యువ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి



సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్: యువ రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధరంగాలతో అదనపు ఆదాయాన్ని పొందాలని మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. పెరటి కోళ్ల పెంపకంపై మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో యువ రైతులకు ఆర్య ప్రాజెక్టులో భాగంగా నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త మాలతి మాట్లాడుతూ రైతులు పెరటి కోళ్ల పెంపకం జాగ్రత్తలు రకాల ఎంపికలపై వివరించారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ బి.రామచంద్రనాయక్, డాక్టర్ కిరణ్ కుమార్, బి.క్రాంతి కుమార్, మురళి, రాంబాబు, కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టుగా అబార్షన్లు!

- అనుమతులు లేకున్నా.. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్న ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లు, ఆస్పత్రులు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు

తొర్రూరు: జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల పనితీరు, అందిస్తున్న సేవలపై వైద్యాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అబార్షన్లకు అడ్డూఅదుపు లేకుండా పోతుందనే ఆరోపణలు ఉన్నాయి. వివిధ కారణాలతో మహిళలు అబార్షన్ల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే వారు నిరాకరిస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అబార్షన్ చేస్తే చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టంగా ఉన్నా.. కొందరు ప్రైవేట్ వైద్యులు బాధితుల నుంచి అందిన కాడికి రాబట్టుకుని గుట్టుగా అబార్షన్లు చేస్తున్నారు. తాజాగా నర్సింహులపేటకు చెందిన 16 ఏళ్ల బాలిక గర్భం దాల్చగా అబార్షన్ కోసం తల్లి తన కూతురును తొర్రూరు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి అబార్షన్ చేయించింది. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో ఆస్పత్రి వైద్యుడిపై కేసు నమోదు చేశారు. దీంతో పాటు గర్భానికి కారకుడైన వ్యక్తిపై, అబార్షన్‌కు సహకరించిన తల్లిపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.

యథేచ్ఛగా అబార్షన్లు..

జిల్లాలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో అబార్షన్లు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. 2024 ఏప్రిల్ 7న కురవి మండలం పిల్లిగుంట్ల తండాలోని ఓ ఇంట్లో గర్భిణులకు ఆర్ఎంపీలు మొబైల్ యంత్రంతో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండగా పోలీసులు, వైద్యాధికారులు ఆ ప్రదేశానికి వెళ్లి వారిని పట్టుకున్నారు. 2023 అక్టోబర్‌లో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆపరేషన్ వికటించి ఓ మహిళ మృతి చెందింది. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలాంటివి పునరావృతం అవుతున్నాయి. జిల్లాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు 986 మంది మాత్రమే ఆడపిల్లలు ఉన్నారు. ఈ గణాంకాలు భవిష్యత్‌లో ఎదురయ్యే ప్రమాద ఘంటికలను తెలియజేస్తున్నాయి. జిల్లాలో ఏడాది కాలంలో 2,218 అబార్షన్లు జరిగినట్లు వైద్యాధికారులు గుర్తించారు.

నిబంధనలు ప్రచారానికే..

లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమనే విషయం ప్రచారానికే పరిమితమైంది. భ్రూణహత్యల నియంత్రణలో వైద్యారోగ్య శాఖ అధికారులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల్లోని కొన్ని ఆస్పత్రులు ఈ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని తెలిసినా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల తీరు మారడం లేదు. అనుమతి లేకున్నా స్కానింగ్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న కేంద్రాల్లో రేడియాలజిస్టు స్కానింగ్ చేస్తారు. బహిర్గత పరచరు. అనుమతిలేని కేంద్రాల్లో పుట్టేది ఆడో, మగో తేల్చేస్తున్నారు. ఇందుకు ఒక్కో వ్యక్తి నుంచి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

బాలికకు అబార్షన్ చేసిన ఘటనలో పోలీసులు ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళతో మరిపెడ మండలం చిల్లంచెర్ల గ్రామానికి పోలోజు రాజు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో వివాహిత కూతురుతోనూ రాజు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. దీంతో ఆ బాలిక గర్భం దాల్చింది. అప్పటికే 5 నెలల గర్భం ఉందని తేలడంతో తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, చైల్డ్ లైన్ ప్రతినిధులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. వారి నిర్ధారణ అనంతరం పోలీసులు, ఐసీడీఎస్, వైద్యాధికారులకు సమాచారం అందించారు. ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు అబార్షన్ చేసిన వైద్యుడిపై కేసు నమోదు చేయడంతో పాటు గర్భం దాల్చేందుకు కారకుడైన వ్యక్తిపై, అబార్షన్‌కు సహకరించిన తల్లిపై పోక్సో కేసు నమోదు చేశారు.



తొర్రూరులో అబార్షన్ నిర్వహించిన ప్రైవేట్ ఆస్పత్రిలో విచారణ చేస్తున్న వైద్యాధికారులు

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..



లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరం. అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అబార్షన్లు చేసినట్లు తేలితే ఆస్పత్రిని సీజ్ చేస్తాం. అన్ని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ నిబంధనలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. సమాచారం తెలిసిన వారు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- గుండాల మురళీధర్, డీఎంహెచ్ఓ

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న విజయనిర్మల

గంగారం: రైతులకు యాసంగిలో పంటలకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, ఎవరైన షాపుల యాజమానులు అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. గంగారం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టాక్ రికార్డులు పరిశీలించారు. షాపు నోటీసు బోర్డులో ధర పట్టిక రాయాలన్నారు. అనంతరం మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాంబాబు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

పీఈటీల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌సాగర్

- పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌సాగర్

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పీఈటీల, పీడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ వ్యాయామవిద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుని విజయ్‌సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శనిగపురం ప్రభుత్వ పాఠశాలలో శనివారం వ్యాయామవిద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌సాగర్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీపీఈడీ అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి పదోన్నతులు కల్పించామని, సీఆర్టీలుగా, ఆర్ఎంఎస్ఏ పీఈటీలుగా ఉన్న వారికి మినిమం టైం స్కేల్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.

అనంతరం వ్యాయామవిద్య ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వాసిరెడ్డి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా బి.చాంప్లనాయక్, కోశాధికారిగా మహాంకాళి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగరాజు గౌడ్, వివిధ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగీలాల్, రంగారెడ్డి, సిద్దార్థ్, ఇమ్రాన్, కొమ్మలు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇంటర్ గురుకులాల్లో ప్రవేశాలకు

దరఖాస్తుల ఆహ్వానం

హసన్‌పర్తి: తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ కె. ఇందుమతి శనివారం తెలిపారు. 2025లో పదో తరగతి పరీక్షలకు హాజరైన బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు http:tgrjc.gov.in దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 040– 24734899, 9866559727 నంబర్లను సంప్రదించాలని జిల్లా కో–ఆర్డినేటర్ ఇందుమతి సూచించారు.

4వ తేదీన గిరిజన భవన్‌లో జాబ్‌మేళా

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఏటూరునాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో వచ్చే నెల 4వ తేదీన ఉదయం 10 గంటలకు హనుమకొండలోని గిరిజన భవన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డి.ఫార్మసీ, ఎఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదవిన, ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటా, విద్యార్హత జిరాక్స్ ప్రతులతో సకాలంలో జాబ్ మేళాకు హాజరు కావాలని పీఓ పేర్కొన్నారు.



అరచేతిలో విద్యుత్ సేవలు

యాప్ రూపొందించిన టీజీ ఎన్పీడీసీఎల్ | 20 ఫీచర్లతో అందుబాటులోకి..

సాక్షి మీకోసం

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో టీజీ ఎన్పీడీసీఎల్ ఓ యాప్‌ను రూపొందించింది. సుమారు 20 ఆధునిక ఫీచర్లతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యాప్ ద్వారా ఇంట్లోనే ఉండి సమస్యలపై ఫిర్యాదు చేయడంతోపాటు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, నూతన సర్వీస్‌ల మంజూరు, పేరు మార్పు వంటి సేవలు పొందే అవకాశముంది.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్: ఎక్కడ ఎలాంటి ఘటన జరిగినా ఇందులో జీపీఎస్ లోకేషన్ ద్వారా వినియోగదారుడి ఫోన్ కెమెరా నుంచి ఆ ఘటన ఫొటో తీసి పంపవచ్చు. తద్వారా రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. దీంతో సమస్య త్వరగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

కన్స్యూమర్ గ్రీవెన్స్: వినియోగదారుడి సమస్యలు నేరుగా ఇందులో పొందుపరచవచ్చు. వినియోగదారుడి మీటర్ నంబర్, సమస్య వివరాలు ఇందులో నమోదు చేస్తే సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించి ఏ అంశమైనా ఫిర్యాదు చేసే సౌకర్యం ఈ యాప్‌లో అందుబాటులో ఉంది. ఫిర్యాదు స్టేటస్ చూసుకునే సౌలభ్యం ఉంది. సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందకపోతే పునరావృతం చేసుకునే వీలుంది.

సెల్ఫ్ రీడింగ్: ఈ యాప్ ద్వారా వినియోగదారులు సెల్ఫ్ రీడింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రతీ నెల నిర్ణీత తేదీన వారి విద్యుత్ బిల్లులను సెల్ఫ్ మీటర్ రీడింగ్ తీసుకోవచ్చు.

పే బిల్స్: నెలవారీ విద్యుత్ బిల్లులను వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసుకొని చెల్లించవచ్చు. దీంతో సమయం ఆదా అవుతుంది. బిల్ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

బిల్ హిస్టరీ: వినియోగదారులు చెల్లించిన విద్యుత్ బిల్లుల గత చరిత్ర ఇందులో చూసుకోవచ్చు. తద్వారా ప్రతీ నెలా బిల్లు ఎంత వస్తుంది పోల్చుకోవచ్చు. అలాగే విద్యుత్ వినియోగడం ఏ నెల ఎంత పెరిగిందో చూసుకుని పొదుపుగా వాడుకునే అవకాశం ఉంది.

ఆన్‌లైన్ పేమెంట్ హిస్టరీ: ఆన్‌లైన్ ద్వారా చెల్లించిన బిల్లు వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకునే సౌకర్యముంది.

కొత్త సర్వీస్ స్థితి: కొత్త సర్వీసుల రిలీజ్ స్థితిగతులు ఎప్పటికప్పుడు అప్లికేషన్ నంబర్ ఎంటర్ చేసి తెలుసుకునే సౌకర్యం ఉంది. తద్వారా కొత్త సర్వీసుల మంజూరు వేగంగా జరుగుతుంది.

లింక్ ఆధార్– మొబైల్: వినియోగదారుల ఆధార్, మొబైల్ నంబర్లు లింక్‌తో విద్యుత్ బిల్లుల సమాచారం ఫోన్‌కు చేరుతుంది. దీంతో గడువులోగా బిల్లులు చెల్లించవచ్చు

కొత్త కనెక్షన్, పేరుమార్పు: కొత్త విద్యుత్ కనెక్షన్ తీసుకోవడానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇందులో పొందుపరిచారు. దీంతోపాటు విద్యుత్ మీటర్ పేరు మార్పు, లోడ్‌కు సంబంధించిన వివరాలు ఇందులో ఉన్నాయి.

పవర్ కంజప్షన్ గైడ్ లైన్స్: విద్యుత్ ఉపకరణాలు ఎంత వాడితే ఎంత విద్యుత్ వినియోగం అవుతుందో ఇందులో వివరించారు.

టారిఫ్ డీటెయిల్స్: విద్యుత్ వినియోగం చార్జీల వివరాలు కేటగిరీల వారీగా ఇందులో ఉంటాయి. గృహ, గృహేతర వినియోగదారులు, పరిశ్రమలు, ఇతర కేటగిరీల వారీగా చార్జీల వివరాలు ఇందులో పొందుపరిచారు.

ఎనర్జీ సేవింగ్, సేఫ్టీ టిప్స్: విద్యుత్ ఉపకరణాలు వాడుతున్నపుడు పాటించాల్సిన పొదుపు సూచనలు, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇందులో వివరించారు.

ఫీడ్ బ్యాక్: వినియోగదారులకు అందిస్తున్న సేవలపై అభిప్రాయాన్ని పంచుకోవచ్చు. ఇది చాలా ముఖ్యం. సలహాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకొని మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుంది.

మై అకౌంట్: మై అకౌంట్‌లో వినియోగదారుల పూర్తి వివరాలు ఉంటాయి. వారి మీటర్ తాలూకు వివరాలు, తదితర సమాచారం ఉంటుంది.

వినియోగదారుల బిల్లు సమాచారం: దీనిలో వినియోగదారుల సర్వీస్ నంబర్ నమోదు చేసి బిల్లు వివరాలు తెలుసుకోవచ్చు.

అధికారి వివరాలు: వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోచ్చు. వినియోగదారులకు ఎటువంటి సందేహాలున్న తమ పరిధిలోని అధికారిని ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు.

కాంటాక్ట్ అజ్: ఇందులో 24/7 పనిచేసే టోల్ ఫ్రీ నంబర్లు 1800 4250028, 1912 ఉంటాయి. వీటి ద్వారా సమస్యలు త్వరగా పరిష్కరించుకునే వెసులుబాటు ఉంది.

యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌పై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. అరచేతిలోకి విద్యుత్ సేవలు తీసుకెళ్లడానికి ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి యాప్‌ను ఆధునికీకరించి 20 రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

– మధుసూదన్‌రావు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ, హనుమకొండ

యాప్‌తో అనేక ప్రయోజనాలు



టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ద్వారా అనేక ప్రయోజనాలున్నాయి. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని సేవలు పొందొచ్చు. కార్యాలయాలకు రావాల్సిన సమయం, ఖర్చులు ఆదా అవుతాయి.

– గౌతం రెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్, ఎస్ఈ వరంగల్

చెరువులో చేపలు పడుతుండగా..

దొంగలుగా భావించి బిహార్ కూలీలను చెట్టుకు కట్టేసిన కాంట్రాక్టర్లు
- గోవర్ధనగిరిలో ఘటన

రఘునాథపల్లి: చెరువులో చేపలు పడుతున్న ఐదుగురిని దొంగలుగా భావించి చెట్టుకు కట్టేసిన ఘటన శనివారం మండలంలోని గోవర్ధనగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన కొందరు కూలీలు గ్రామశివారులోని ఆయిల్ కంపెనీలో పనులు చేస్తున్నారు. మధ్యాహ్న సమయంలో గ్రామ శివారులోని ఆనకుంటలో ఐదుగురు కూలీలు చెరువులో చేపలు పడుతున్నారు. కుంట చేపలను సంరక్షిస్తున్న కాంట్రాక్టర్లు వారిని దొంగలుగా భావించి తాడుతో చెట్టుకు కట్టేశారు. ఇటీవల వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు అపహరణకు గురవుతుండంతో వీరి పనేగా భావించి, చెట్టుకు కట్టేసిన ఫొటోలు గ్రామ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. అదే ఆయిల్ కంపెనీలో పని చేసే స్థానికులు వారిని గుర్తించి వారు బిహార్‌కు చెందిన కూలీలని, దొంగలు కాదని.. సరదాగా చేపలు పట్టేందుకు వచ్చారని వివరించడంతో వదిలేశారు.



చెట్టుకు కట్టేసి ఉన్న కూలీలు

సరదా.. విషాదమైంది

- ట్రాక్టర్ పైనుంచి జారిపడి బాలుడి మృతి
- పూమ్యాతండా సమీపంలో ఘటన




సాయికుమార్ మృతదేహం

గార్ల: సరదా.. విషాదమైంది. ట్రాక్టర్ పైనుంచి జారి టైర్ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం పూమ్యాతండా సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గార్ల గ్రామ పంచాయతీ పూమ్యాతండాకు చెందిన బానోత్ సాయికుమార్(15) సరదాగా ట్రాక్టర్‌పై మిరుపతోట వెళ్లాడు. మిర్చిబస్తాలు లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్ పొలం గట్టు ఎక్కుతున్న క్రమంలో ఒక్కసారి కుదుపునకు గురైంది. దీంతో బాలుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కిందపడ్డాడు. వెనుక టైర్ బాలుడిపైనుంచి వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్ గార్లలో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా, సాయికుమార్ తండ్రి మంగీలాల్ 3 ఏళ్ల క్రితం ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి మృతిచెందాడు. సాయికుమార్‌కు తల్లి బుజ్జి, ముగ్గురు అక్కలు ఉన్నారు. కుటుంబంలో ఉన్న ఒక్కగానొక్క మగ దిక్కును కోల్పోయామని మృతుడి తల్లి, అక్కలు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. పోలీసులు ఘటనా స్థలిని సందర్శించారు.

సంకీర్ణ ప్రభుత్వాలతోనే సుస్థిర పాలన

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి
- ముగిసిన జాతీయ సదస్సు



పరిశోధన పత్రాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్ : సంకీర్ణ ప్రభుత్వాలతో సుస్థిర పాలన సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా సెనేట్‌హాల్‌లో 'భారత సమాజంలో సంకీర్ణ ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం సాయంత్రం ముగిసింది. ఈ ముగింపు సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణ రాజకీయాలు, ప్రభుత్వాలు బహుళ వర్గాల ప్రజల ఐక్యతకు ప్రతీకయే గాకుండా ప్రజలకు జవాబుదారీగా వ్యవహరిస్తాయన్నారు.

సంకీర్ణ రాజకీయాలతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

ప్రజాస్వామ్యం బలోపేతం, సంపదకేంద్రీకరణ సంకీర్ణ రాజకీయాలతోనే సాధ్యమని ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు కె. శ్రీనివాసులు అన్నారు. ఈ సదస్సులో ఆయన ప్రధానవక్తగా పాల్గొని మాట్లాడారు. సంకీర్ణం కేవల రాజకీయాలకు మాత్రమే కాదని ఆర్థిక సామాజికంలోనూ అవసరం అన్నారు. సంకీర్ణానికి భారతీయ జాతీయ ఉద్యమం గొప్ప ఉదాహరణ అన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి సంకినేని వెంకట్, యూజీసీ కోఆర్డినేటర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, మద్రాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మణ్ మాట్లాడారు. ఆ విభాగం బీఓఎస్ చైర్మన్ గడ్డం కృష్ణయ్య, రిటైర్డ్ ఆచార్యులు రఘురాంరెడ్డి, జి వీరన్న,హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ సదస్సులో 9 సెషన్లలో వంద మంది పరిశోధన పత్రాలు సమర్పించారు. ఈ పరిశోధన పత్రాలను పుస్తకం రూపంలోకి తీసుకురాగా వీసీ, రిజిస్ట్రార్ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు ఆవిష్కరించారు.

ఇక ఎత్తిపోసుడే..

- దేవాదుల–3 మోటార్లు ప్రారంభానికి అంతా సిద్ధం



పంప్‌హౌస్

హసన్‌పర్తి : దేవాదుల ప్రాజెక్టు మూడో దశ కింద దేవన్నపేటలో నిర్మించిన పంప్‌హౌస్ నుంచి ధర్మసాగర్ చెరువులోకి నీటిని ఎత్తిపోయడానికి అంతా సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం లేదా సాయంత్రం మంత్రి చేతుల మీదుగా మోటార్ల ప్రారంభానికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి నీటిపారుదలశాఖ మంత్రా? ఇన్‌చార్జ్ మంత్రిని ఆహ్వానిస్తారా అనే విషయం అధికారులు స్పష్టంగా పేర్కొనడం లేదు. ఐదు రోజుల క్రితమే నీటిపారుదల శాఖ మంత్రి మోటార్లు ప్రారంభించడానికి వచ్చి కేవలం పూజలు చేశారు. ఆ రోజు అర్ధరాత్రి వరకూ మోటార్లు ప్రారంభించడానికి వేచి చూసి వెనుదిరిగారు. అప్పటికే పనులు పూర్తి కాకపోవడంతో ఆయన అధికారులపై సీరియస్సయ్యారు. ఇదిలా ఉండగా, పనులు పూర్తికి ఐదురోజుల సమయం పట్టింది. అధికారులు రాత్రింబవళ్లు పంప్‌హౌస్ వద్ద ఉంటూ పనులు పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేశారు.

ప్రత్యేక నిపుణుల రాక..

దేవాదుల ప్రాజెక్టు–3 కింద ఏర్పాటు చేసే మోటార్లు ఆస్ట్రియాకు చెందిన అండ్రీజ్ కంపెనీవి. మోటార్లు ఆన్‌చేస్తే మళ్లీ ఏదైనా సాంకేతిక సమస్యలు ఏర్పడకుండా అధికారులు జాగ్రత్త పడ్డారు. ఆ దేశానికి చెందిన ప్రత్యేక నిపుణులతో ట్రయల్ కోసం దేవన్నపేటలోని పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. ట్రయల్ రన్ కోసం అంతా సిద్ధం చేశారు. ఆదివారం ట్రయల్ రన్ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే అధికారులు రెండు రోజులుగా డ్రై రన్ కొనసాగిస్తున్నారు.

నకిలీ పురుగు మందుల ముఠా అరెస్ట్

- రూ.78 లక్షల 63 వేల విలువైన మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



నిందితులతోపాటు నకిలీ పురుగు మందులను చూపుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: ప్రముఖ కంపెనీల పేర్లతోపాటు గడువు తీరిన పురుగు మందులను రైతులకు అంటగడుతున్న ముఠాలోని ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.78లక్షల 63 వేల విలువైన నకిలీ పురుగు మందులు, మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీన చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్.. నిందితుల అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం వరంగల్ మట్టెవాడ బొడ్రాయి సమీపాన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్ ఇంటిపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు, వ్యవసాయధికారులు సంయుక్తంగా దాడి చేశారు. ఇందులో ముగ్గురు నిందితులు సిద్ధిక్, రాజేశ్, సదాశివుడుని అదుపులోకి తీసుకుని పెద్ద మొత్తంలో నకిలీ, గడువు తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మట్టెవాడ పీఎస్‌లో విచారించారు. ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేద ప్రకాశ్.. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో స్థానిక వ్యాపారులు, పురుగు మందుల కంపెనీ ప్రతినిధి అయిన మరో నిందితుడు సిద్ధిక్ వద్ద కాలం తీరిన పురుగు మందులను కొనుగోలు చేసేవాడు. అలాగే, గడువు దాటిన పురుగు మందులతోపాటు, ఇద్దరు నిందితులైన ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్, ప్రస్తుతం జైలులో ఉన్న ఆదిత్య నుంచి ప్రముఖ పురుగు కంపెనీలైన ధనూక, టాటా, రైల్స్, బెయర్, ఆడ్మాతోపాటు మరికొన్ని కంపెనీ పేర్లతో తయారు చేసిన నకిలీ పురుగు మందులు కొనుగోలు చేసేవాడు. ఈ విధంగా సేకరించిన గడువు తీరిన పురుగు మందులతోపాటు నకిలీ పురుగు మందులను ప్రభుత్వ అనుమతులు లేని మిగతా నిందితులకు విక్రయించాడు. ఈ నకిలీ పురుగు మందులను కొనుగోలు చేసిన నిందితులు.. వీటిని స్థానికంగా ఉన్న వ్యవసాయదారులకు విక్రయిస్తూ మోసగించేవారు. పోలీసులు అరెస్ట్ చేసిన ప్రధాన నిందితుడు ఇరుకుళ్ల వేదప్రకాశ్‌తో పాటు సదాశివుడు, రాజు ఆదిత్య గతంలోనూ పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ప్రధాన నిందితుడి సమాచారం మేరకు ఆళ్ల చెరువు శేఖర్, విష్ణువర్ధన్ గోదాములపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు దాడులు చేశారు. నిందితుల్లో విష్ణువర్ధన్ పరారీలో ఉన్నాడు. మరో వ్యక్తి ముద్దగుల ఆదిత్య హైదరాబాద్ జైలులో ఉండగా.. మిగతా ఏడుగురు మట్టెవాడకు చెందిన ఇరుకుల్ల వేదప్రకాశ్, లక్ష్మీపురానికి చెందిన మహ్మద్ సిద్ధిక్ అలీ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన నూక రాజేశ్ అలియాస్ రాజు, కరీంనగర్‌కు చెందిన యల్లం సదాశివుడు, ములుగు జిల్లా గోవిందరావుపేటకు చెందిన ఎండీ రఫీక్, ఏపీలోని ప్రకాశం జిల్లా మదుగుకు చెందిన ఆళ్ల చెరువు శేఖర్, దుగ్గొండికి చెందిన పాదిళ్ల సాంబయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అనురాధ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్లు గోపి, రాజు, ఎస్సైలు వంశీకృష్ణ, నవీన్, ఆర్‌ఎస్సై భాను ప్రకాశ్, ఏఏఓ సల్మాన్‌పాషా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు సురేశ్, సురేందర్, సాంబరాజు, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేటకు వెళ్లి.. ఉచ్చుకు తగిలి

- కరెంట్ షాక్‌కు గురై వ్యక్తికి తీవ్ర గాయాలు
- చికిత్స పొందుతూ మృతి



గంగయ్య(ఫైల్)

ఏటూరునాగారం: అటవీ జంతువులను వేటాడటానికి వెళ్లిన ఓ వ్యక్తి.. కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని కొత్తగుడిసెల ప్రాంతానికి చెందిన తుమ్మ గంగయ్య(50), లొటపెటల నారాయణ, ఎద్దు లోకేశ్ కలిసి శుక్రవారం అర్ధరాత్రి చిన్నబోయినపల్లి అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు వెళ్లారు. ముగ్గురు కలిసి 33 కేవీ విద్యుత్‌లైన్‌కు కరెంట్ ఉచ్చులు తగిలించే ప్రయత్నం చేశారు. ఇందులో గంగయ్య కర్ర పట్టుకుని కరెంట్ వైర్లకు ఉచ్చుకు అమర్చిన వైర్ తగిలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన లోకేశ్, నారాయణ భయభ్రాంతులకు గురై అక్కడి నుంచి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శనివారం ఉదయం ఘటనా స్థలికి చేరుకుని అతడిని రెండు కిలోమీటర్ల మోసుకుంటూ బయటకు తీసుకొచ్చారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఈ ఘటనలో లోకేశ్, లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కూతుళ్లు మౌనిక, అనిత ఉన్నారు.

సౌర ప్లాంట్‌తో రైతులు ఆర్థికంగా బలోపేతం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ఏర్పాటుతో రైతులు ఆర్థికంగా బలోపేతమవుతారని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్‌కో) సంయుక్తంగా శనివారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల కార్యాలయంలో 'కుసుమ్' పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎండీ వరుణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడారు. రైతులు సౌర శక్తిని ఉత్పత్తి చేసి మరింత ఆదాయం సమకూర్చుకోవడానికి ఇది సువర్ణ అవకాశమన్నారు. సోలార్ ద్వారా ఉత్పత్తి చేసిన ప్రతీ యూనిట్‌కు రూ.3.13 ఇస్తామని, ప్రతీ నెల రైతు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. రూ.2 కోట్ల వరకు ఆరు శాతం వడ్డీకి బ్యాంకులు రుణాలు ఇస్తాయన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులు ఈ నెల 28 వరకు రూ.లక్ష పూచీకత్తు సొమ్ము డిపాజిట్ చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే పూచీకత్తు సొమ్ము చెల్లిస్తామన్నారు. 25 ఏళ్ల అగ్రిమెంట్‌తో రైతులు లాభాలతో కూడిన నిలకడ ఆదాయం పొందొచ్చన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్లు కె.వెంకటరమణ, రాజుచౌహాన్, జీఎం మల్లికార్జున్, టీజీ రెడ్కో డీజీఎం. వెంకటరమణ, డీఈలు అమర్‌నాథ్, సంపత్‌రెడ్డి, ఏఈ శ్రీపాల్ పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలి

- ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయ భాను



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను, అధికారులు

హన్మకొండ: వేసవిలో ఆరోగ్యం కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను డిపో మేనేజర్లు, సిబ్బందికి సూచించారు. శనివారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలోని 9 డిపోల మేనేజర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ చాలెంజ్‌ను విజయవంతంగా నిర్వహించాలన్నారు. డీహైడ్రేషన్ నివారణకు రోజు తగిన మోతాదులో నీరు, మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకోవాలన్నారు. విధులు ముగిసిన తర్వాత తగిన విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఎలాంటి లీవ్‌లు, సిక్ లీవ్ తీసుకోని, గైర్హాజర్ కాకుండా డ్యూటీలకు హాజరైన వారికి ప్రోత్సాహాలు అందించనున్నట్లు చెప్పారు. మార్చి నుంచి జూన్ మాసాంతం వరకు మరింత శ్రద్ధతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ డిపోల ఆర్థికాభివృద్ధికి, తద్వారా రీజియన్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, అకౌంట్స్ ఆఫీసర్ రవీందర్ రావు, డిపోల డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.